సాక్షి
కామారెడ్డి

సోమవారం : 5 : మే : 2025



వైఎస్సార్ కల

ప్రాణహిత– చేవెళ్ల పథకం పూర్తి చేయడం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కల అని షబ్బీర్ అలీ పేర్కొన్నారు.

- 10లో ▸



సద్వినియోగం చేసుకోవాలి

వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు సూచించారు.

- 11లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
44.7 /22.0

ఉదయం ప్రకాశవంతంగా ఉంటుంది. వాతావరణం పొడిగా మారుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎలుగుబంటి కలకలం



ఎల్లారెడ్డి : తిమ్మారెడ్డి అటవీ ప్రాంతంలో ఆదివారం ఎలుగుబంటి కలకలం రేపింది. కళ్యాణి గ్రామానికి చెందిన పట్కరి మియా జాని తునికాకు తెంపేందుకు ఆదివారం అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ ఎలుగు బంటిని గమనించి అది వెళ్లిపోయేంతవరకు నిశ్శబ్దంగా ఉన్నానని తెలిపాడు. ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలపడంతో వారు భయాందోళనలకు గురవుతున్నారు.

ఎస్సెస్సీ టాపర్లకు సన్మానం



కామారెడ్డి టౌన్: ఎస్సెస్సీలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదివారం తన చాంబర్‌లో సన్మానించారు. 596 మార్కులు సాధించిన అంచిత, 590 మార్కులు సాధించిన గాయత్రి, శ్రేణితలను అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీఆర్ స్కూల్ కరస్పాండెంట్ మారుతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భగీరథ మహర్షి జయంతి



కామారెడ్డి క్రైం : బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు కొత్తపల్లి మల్లయ్య, చక్రధర్, బంజేపల్లివార్ హన్మాండ్లు, మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'తలసేమియా బాధితులకు అండగా నిలవాలి'



బీబీపేట: తలసేమియా బాధితులకు అండగా నిలవాలని ఐవీఎఫ్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జైళ్ల శాఖ హైదరాబాద్ రేంజ్ డీఐజీ దుద్దెల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీనివాస్ గుప్తా జన్మదినం సందర్భంగా బీబీపేటలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 105 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సంయుక్తంగా ఇప్పటివరకు 3 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించి, తలసేమియా బాధిత చిన్నారుల కోసం అందించడం అభినందనీయమన్నారు. చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ బాలు, వివిధ సంఘాల ప్రతినిధులు జమీల్ హైమద్, వెంకటరమణ, నాగభూషణం, సాయినాథ్, విశ్వప్రసాద్, నాగేశ్వర్, చంద్రశేఖర్, యాదగిరి, వెంకటేశం పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

కామారెడ్డి టౌన్ : దేశవ్యాప్తంగా ఈనెల 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా మార్చిందని విమర్శించారు. సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని కోరారు.



దరఖాస్తుపై విచారణ నిమిత్తం కన్నాపూర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ సంగ్వాన్, సబ్‌కలెక్టర్ కిరణ్మయి, అధికారులు (ఫైల్)

వడివడిగా..

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వం పేర్కొన్న నేపథ్యంలో రైతుల్లో ఆశలు చిగురించాయి. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన లింగంపేట మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో రైతులు భారీ సంఖ్యలో పాల్గొని తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. 23 రెవెన్యూ గ్రామాలలో కలిపి 4,225 దరఖాస్తులు వచ్చాయి. వాటి పరిష్కారంకోసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

- భూ భారతి పైలట్ ప్రాజెక్టు మండలంలో 23 సదస్సులు
- రైతుల నుంచి 4,225 దరఖాస్తులు..
- సమస్యల పరిష్కారంపై అధికారుల దృష్టి
- క్షేత్ర స్థాయిలో మొదలైన విచారణ
- ఇప్పటివరకు 367 సమస్యల పరిశీలన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టాన్ని అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. అందులో లింగంపేట మండలం ఒకటి. భూ భారతిని ప్రయోగాత్మకంగా అమలు చేయడంలో భాగంగా గతనెల 17 నుంచి 30 వరకు రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహించారు. ఆయా సదస్సుల్లో భూ సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కొన్ని గ్రామాల్లో వందలాది దరఖాస్తులు వచ్చాయి. లింగంపేట మండలంలోని 23 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో కలిపి మొత్తం 4,255 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ 'సాక్షి'కి వివరించారు. ప్రజల నుంచి వచ్చిన అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు వారికి నోటీసులు ఇచ్చి రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ జరుపుతున్నారని తెలిపారు. ఇప్పటివరకు 367 దరఖాస్తులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో విచారణ జరిగిందన్నారు.

అత్యధికంగా శెట్పల్లి సంగారెడ్డిలో..

భూ భారతి సదస్సులకు భారీ స్పందన లభించింది. కొన్ని గ్రామాల్లో వందలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధికంగా శెట్పల్లి సంగారెడ్డిలో 914 దరఖాస్తులు రాగా అత్యల్పంగా జల్దిపల్లిలో 18 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. పోతాయిపల్లిలో 453 దరఖాస్తులు, లింగంపల్లి కుర్దులో 337, ముంబోజీపేటలో 309, భవానీపేటలో 232, లింగంపేటలో 2 వందల దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. .

పాసుపుస్తకాలు, సర్వే నంబర్ల మిస్సింగ్..

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో 45 శాతం పాసుపుస్తకాలు రాలేదని, డిజిటల్ సంతకాలు లేవని, సర్వే నంబర్లు మిస్ అయ్యాయని, భూ విస్తీర్ణం తక్కువగా వచ్చిందని, మ్యుటేషన్ అమలు కాలేదన్న సమస్యలపైనే ఉన్నాయి. 25 శాతం అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలపై వచ్చాయి. 15 శాతం రెవెన్యూ, అటవీ వివాదాలకు సంబంధించినవి కాగా.. పది శాతం సాదా బైనామాలు, ఐదు శాతం అసైన్డ్ భూముల క్రయవిక్రయాలకు సంబంధించినవి.

రెవెన్యూ గ్రామాలవారీగా దరఖాస్తుల వివరాలు..

రెవెన్యూ గ్రామం	దరఖాస్తులు	రెవెన్యూ గ్రామం	దరఖాస్తులు
		కన్నాపూర్	106
		శెట్పల్లి	103
శెట్పల్లి సంగారెడ్డి	914	నల్లమడుగు	99
పోతాయిపల్లి	453	బాయంపల్లి	96
లింగంపల్లి కుర్దు	337	రాంపూర్	95
ముంబోజీపేట్	309	కోర్పోల్	90
భవానీపేట్	232	ఎల్లారం	86
లింగంపేట్	200	మెంగారం	84
పర్మల్ల	187	బోనాల్	75
పోల్కంపేట్	183	కంచుమల్	72
మోతె	173	నాగారం	60
బాణాపూర్	128	జల్దిపల్లి	18
కొండాపూర్	125		

వేగంగా విచారణ...

పైలట్ మండలంలో భూ సమస్యలను పరిష్కరించడంపై అధికారులు ఫోకస్ చేశారు. రెవెన్యూ సదస్సులు ముగిసిన వెంటనే రెవెన్యూ గ్రామాల వారీగా రైతులు ఇచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దరఖాస్తులన్నింటినీ పరిశీలిస్తున్నారు. ఆయా సమస్యలపై క్షేత్ర స్థాయిలో దరఖాస్తుదారులను పిలిపించి వారి సమక్షంలో విచారణ చేపడుతున్నారు. సదస్సులు పూర్తయిన తర్వాత 367 దరఖాస్తులకు సంబంధించి విచారణ జరిగింది. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గ్రామాలకు వెళ్లి విచారణ జరుగుతున్న తీరును పరిశీలిస్తున్నారు. రెవెన్యూ అధికారులకు సలహాలు ఇస్తూ విచారణ వేగంగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశిస్తున్నారు.

ఇక ప్రతి రైతుకు గుర్తింపు!

- 11 నంబర్ల యునిక్ కోడ్‌తో ఐడీ కార్డులు
- ఆధార్, పాస్‌బుక్, మొబైల్ నంబర్‌లతో లింక్
- నేటి నుంచి నెలాఖరు వరకు 'ఫార్మర్ రిజిస్ట్రీ' కార్యక్రమం

కామారెడ్డి క్రైం: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఫార్మర్ ఐడీ ప్రాజెక్టు అమలులో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ నెలాఖరు వరకు కొనసాగనుంది. ప్రతి రైతు నుంచి వివరాలు సేకరించి రైతులందరికీ ప్రత్యేక డిజిటల్ కార్డులను జారీ చేయనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా అన్ని క్లస్టర్ల పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రీని ప్రారంభించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. భవిష్యత్ అవసరాలకు, కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలకు ఈ కార్డు ప్రామాణికం కానుందని పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన రుణమాఫీ, రైతు భరోసా తదితర పథకాలకు ఈ కార్డుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

భవిష్యత్తులో సంక్షేమ పథకాలను పొందడానికి అర్హులుగా ఉండాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి.. పీఎం కిసాన్ లబ్ధిదారులు తదుపరి లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ కార్డు నంబరు ద్వారా ఆన్‌లైన్‌లో రైతు పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుంది కాబట్టి పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆధార్ తరహాలో..

రైతులకు సంబంధించిన అన్ని సంక్షేమ పథకాలకు ఫార్మర్ ఐడీ కీలకం కానుంది. ఈ గుర్తింపు సంఖ్య పొందడం సులువే.. ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ వివరాలను వ్యవసాయ విస్తీర్ణాధికారులకు అందిస్తే.. వారు వివరాలు నమోదు చేసి, 11 నంబర్లు గల ఫార్మర్ ఐడీ సంఖ్య ఇస్తారు. రెవెన్యూ శాఖ వద్దనున్న భూయాజమాన్య వివరాలను ప్రామాణికంగా తీసుకుని రైతులకు ఐడీ కార్డులు జారీ చేస్తారు. కార్డు జారీ చేయడానికి ముందే భూమి వివరాలు సర్వే నంబర్ భూమి రకం, సాగు చేస్తున్న పంటల వివరాలు అన్నింటినీ తెలుసుకుని రైతుకు సబంధించిన పూర్తి సమాచారం ఇందులో నమోదు చేస్తారు.



'దేశం కోసం ఓ బిడ్డను ఇవ్వాలి'



ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యసమాజం ప్రతినిధులు

కామారెడ్డి అర్బన్: ప్రతి హిందూ కుటుంబం ఐదుగురు పిల్లలను కనాలని, దేశం కోసం ధర్మం కోసం ఓ బిడ్డను ఇవ్వాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. పాతరాజంపేట ఆర్ష గురుకులంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ఆర్య వీర్‌దళ్ యువ నిర్మాణ శిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం ప్రతికుటుంబం ఒక బిడ్డను ఇవ్వకుంటే కష్టపడి సంపాదించిన సంపదను ఉగ్రవాదులకు అప్పగించాల్సి వస్తుందని హెచ్చరించారు. హిందువులు ఇంకా సెక్యులర్ మంత్రం జపిస్తే మిగిలేది ఏమీ ఉండదన్నారు. హిందువుల నాశనం కోరుతున్న రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో బుద్ధిచెప్పాలన్నారు. చక్కని విద్యనందిస్తున్న ఆర్ష గురుకులాల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ముగింపు సభలో విద్యార్థులు చేసిన కర్రసాము, కత్తిసాము విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, ఆర్ష గురుకులం అధిపతి బ్రహ్మానంద సరస్వతి, ఆర్య సమాజం ప్రతినిధులు బాజన్న, వేదమిత్ర వేదార్థి ఆర్య, హరిదాస్ ఆర్య, ఆచార్య సందీప్ ఆర్య, శైలేష్‌కుమార్, కనిష్క, రాంనివాస్, ఆచార్య నరేందర్ ఆర్య పాల్గొన్నారు.

8 నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

కామారెడ్డి అర్బన్: వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాల బాట పడుతున్నారు. 'రైతు ముంగింట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' పేరుతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించడంతోపాటు అధిక దిగుబడులు సాధించడంలో మెలకువలను వివరించనున్నారు. జిల్లాలో ఈనెల 8 నుంచి జూన్ 12 వరకు ఎంపిక చేసిన గ్రామాల్లో 'రైతు ముంగింట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి తిరుమలప్రసాద్ తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో ఈనెల 8న ఎర్రాపహాడ్ (తాడ్వాయి), 15న మోతె (లింగంపేట్) 22న లింగాపూర్ (కామారెడ్డి) 29న సదాశివనగర్, 29న అడ్లూర్ ఎల్లారెడ్డి (సదాశివనగర్) గ్రామాలలో సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. వచ్చేనెల 5న గోర్గల్ (నిజాంసాగర్) జూన్ 12న పోచారం (నాగిరెడ్డిపేట) గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. యూరియా వినియోగం, సాగు వ్యయం తగ్గించడం, భూసార పరిరక్షణ, విత్తన, పురుగు మందుల కొనుగోళ్లకు సంబంధించి రశీదులను భద్రపరచడం, సాగునీటి ఆదా, పంట మార్పిడి పద్ధతులు, సుస్థిర వ్యవసాయం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జొన్న కొనుగోలు కేంద్రం మంజూరు

లింగంపేట: పర్మళ్ల గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతుల పేర్లతో దళారులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు అమ్మితే స్టాక్ సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అకాల వర్షంతో రైతన్న ఆగమాగం

- కొనుగోలు కేంద్రాల వద్ద తడిసిన ధాన్యం
- వడగళ్లతో ఇతర పంటలకూ నష్టం
- పిడుగుపాటుతో ఇద్దరి పరిస్థితి విషమం

కామారెడ్డిటౌన్/కామారెడ్డిరూరల్/భిక్కనూరు/దోమకొండ/తాడ్వాయి/గాంధారి/లింగంపేట/రాజంపేట/బీబీపేట: జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆదివారం అకాల వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాలలో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొన్నిచోట్ల వడ్లు కొట్టుకుపోయాయి. జిల్లా కేంద్రంలోని గాంధీ గంజ్‌లో వడ్లు ఆరబెట్టిన రైతులు.. వర్షం రాకతో ఆగమయ్యారు. గంట పాటు కురిసిన వర్షంతో ఇబ్బందిపడ్డారు. కామారెడ్డి పట్టణంలో గంట పాటు కురిసిన వర్షంతో రోడ్లపై నీరు చేరింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

మాచారెడ్డి, రాజంపేట తదితర మండలాల్లో వడగళ్లు కురిశాయి. భిక్కనూరు, దోమకొండ మండలాల్లోని పలు గ్రామాలలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది.



రాజంపేటలో తడిసిన ధాన్యం

లింగంపేట మండలంలోని భవానీపేట, జల్దిపల్లి, రాంపూర్, ముంబోజీపేట, గాంధారి మండలంలోని పలు గ్రామాలలో, తాడ్వాయి మండలకేంద్రంతోపాటు కరడ్‌పల్లి, కన్‌కల్, దేమికలాన్, కృష్ణాజీవాడి, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బలమైన గాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి, పాతరాజంపేట్, సరంపల్లి, క్యాసంపల్లి, దేవునిపల్లి, లింగాపూర్, నర్సన్నపల్లి, చిన్నమల్లారెడ్డి పరిధిలోని గురురాఘవేంద్ర కాలనీలలో వడగండ్లు కురిశాయి. ఆరబోసిన వడ్లు తడిసిపోయాయి. మామిడి కాయలు రాలిపోయాయి. మొక్కజొన్న నేలవాలింది. పలుచోట్ల ఇళ్ల రేకులు లేచిపోయాయి. బీబీపేట మండలం మాందాపూర్‌లో విద్యుత్ స్తంభం విరిగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. వడ్లను వెంటవెంటనే తూకం వేసి, రైస్‌మిల్లులకు తరలించకపోవడంతో నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో నష్టపోయినవారిని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



లింగాపూర్‌లో ధాన్యం చుట్టూ నిలిచిన నీరు



గాంధారి మార్కెట్ కమిటీ ఆవరణలో..



భవానీపేటలో వర్షంలో తడిసి, కొట్టుకుపోయిన ధాన్యం



కామారెడ్డిలో ధాన్యాన్ని కుప్ప చేస్తున్న రైతులు



గురురాఘవేంద్ర కాలనీలో కురిసిన వడగండ్లు

తుజాల్‌పూర్‌లో పిడుగుపాటు కలకలం

అకాల వర్షం ఐదుగురి ప్రాణాల మీదికి తెచ్చింది. బీబీపేట మండలంలోని తుజాల్‌పూర్‌కు చెందిన గోప వివేక్, కలకుంట్ల రాజు, గోప కవిత, గోప హేమలత, గోప రంజిత్ వర్షం వస్తుండడంతో వడ్లను కుప్పచేసి చెట్టుకిందికి చేరారు. ఆ చెట్టుపై పిడుగుపడింది. దీనిని గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.



పెద్దమల్లారెడ్డిలో బలమైన గాలులకు ఒరిగిన వరి పంట



టేక్రియాల్‌లో నీటిలో వడ్లు కొట్టుకుపోకుండా రైతు ప్రయత్నం



కామారెడ్డి గాంధీ గంజ్‌లో తడిసిన ధాన్యం



దోమకొండలో చీపురుతో వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

క్లుప్తంగా

గుంతల రోడ్డుతో ఇబ్బందులు



పూర్తిగా గుంతలతో ఉన్న కోడిచిర రోడ్డు

మద్నూర్(జుక్కల్): మండలంలోని రూసేగావ్ గేటు నుంచి కోడిచిర వరకు గల బీటీ రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని రూసేగావ్ గేటు నుంచి చిన్న ఎక్లార మీదుగా కోడిచిర వరకు గల ఆరు కిలో మీటర్ల బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

భిక్కనూరులో తైబజార్ పేరిట అధిక వసూలు

భిక్కనూరు : మండలంలో ఆదివారం జరిగిన సంతలో తైబజార్‌పేరిట అధిక డబ్బులను కాంట్రాక్టర్ మనుషులు వసూలు చేస్తున్నారని కూరగాయల వ్యాపారులు వాపోయారు. ఒక్క గంపకు రూ.15 తీసుకోవాల్సి ఉండగా కాంట్రాక్టర్‌తో పాటు ఆయన సంబంధీకులు రైతుల వద్ద నుంచి గంపకు రూ. 30 నుంచి రూ. 40 వసూలు చేస్తున్నారు. ఈవిషయంలో రైతులు సంఘటితమై కాంట్రాక్టర్‌తో పాటు ఆయన సంబంధీకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే భిక్కనూరు సంతకు తాము పండించే కూరగాయలను విక్రయించేందుకు తీసుకరామని రైతులు స్పష్టం చేశారు. సంతలో తాగేందుకు కనీసం నీటి సౌకర్యం కూడా కల్పించలేదని రైతులు కాంట్రాక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. గంపకు రూ.15 మాత్రమే చెల్లిస్తామని స్పష్టం చేశారు. అధికంగా టెండర్‌వేసి తమకు ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని రైతులు ఆగ్రహించారు. దీంతో పలువురు వారిని సముదాయించి శాంతింపజేశారు.

ఒలింపిక్ సంఘ భవన స్థలాన్ని కాపాడుకుంటాం



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: ఒలింపిక్ సంఘ భవన స్థ లం కోసం కేటాయించిన స్థలాన్ని కాపాడుకుంటా మని సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య అ న్నారు. ఆదివారం నగరంలోని ముబారక్‌నగర్‌లో ఉన్న ఒలంపిక్ సంఘ భవన స్థలాన్ని సభ్యులతో కలిసి పరిశీలించారు. 2010లో గత ప్రభుత్వం ఖలీల్‌వాడిలో ఉన్న స్టేడియం స్థలానికి బదులు ముబారక్‌నగర్‌లో 7ఎకరాల35 గుంటల స్థలంతో పాటు పక్కనే ఉన్న 700 గజాల స్థలాన్ని సంఘ భవనం కోసం కేటాయించిందని అన్నారు. ఈ స్థలంలో గ తంలో మంత్రి ఉన్న సుదర్శన్‌రెడ్డి మంజూరు చేసిన రూ. 15 లక్షల నిధులతో బేస్మెంట్, పిల్లర్ల వరకు పనులు చేపట్టినట్లు తెలిపారు. కొందరు భూకబ్జాదారులు స్థలాన్ని తమదంటు ఆక్రమణలకు పాల్ప డుతున్నారని అన్నారు. ఎవరైనా స్థలాన్ని కబ్జా చే యాలని చూస్తే సహించేది లేదన్నారు.

భారంగా మారిన పశు పోషణ

- పశుగ్రాసం కొరతతో ఇబ్బందులు
- పక్క రాష్ట్రాలకు తరలుతున్న గ్రాసం
- స్థానికంగా ధరలు పెంచిన వ్యాపారులు



బిచ్కుంద నుంచి మహారాష్ట్ర తరలిస్తున్న వరిగడ్డి

బిచ్కుంద(జుక్కల్): యాసంగిలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొందరు గడ్డి వ్యాపారులు ట్రాక్టర్లకు గడ్డి మోపుచుట్టే పరికరాలు బిగించి గడ్డి కట్టలు కడుతున్నారు. పశువులు లేని రైతులకు వ్యాపారులు కొంత నగదు ఇచ్చి పొలంలో వది లేసిన గడ్డిని కొనుగోలు చేస్తున్నారు. జుక్కల్ నియోజకవర్గంలో గడ్డి ధరలు విపరీతంగా పెరగడంతో రైతులపై భారం పడనుంది.

గడ్డి వ్యాపారులు ట్రాక్టర్ యంత్రాలతో గడ్డి మోపులు కట్టి వాహనాల్లో మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి అమ్ముకుంటున్నారు. గడ్డి ధరలు పెరగడంతో స్థానిక పాడి రైతులకు భారంగా మారింది. ఒక్కో మోపు ధర రూ. 25 నుంచి 35 లకు విక్రయిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఒక్కో గడ్డి మోపును రూ. 70 విక్రయిస్తున్నారు. ఖరీఫ్, రబీలో బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పిట్లం మండలాల్లో ఎక్కువగా సోయా, కంది పంటలు సాగు చేస్తారు. సోయా, కంది పంటల నూర్పిళ్లు జరిగిన వెంటనే వ్యాపారులు రైతులకు కొంత నగదు చెల్లించి పొట్టును తీసుకెళ్తున్నారు. వ్యాపారుల రాకతో స్థానిక పాడి రైతులకు గడ్డి, కంది, సోయా పొట్టు దొరకడం భారంగా మారింది. పాల ఫ్యాట్ రావడానికి కొనుగోలు చేసిన గడ్డితో పాటు పశువులకు దాణా ఇవ్వాల్సి వస్తుంది. రోజుకు రూ. 100 నుంచి 150 ఖర్చు చేయాల్సి వస్తుంది. పాలు అమ్మిన గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

గడ్డి విత్తనాలు అందించని ప్రభుత్వం

పాడి రైతులు, మేకలు, గొర్రెలు ఉన్న రైతులకు గతంలో ప్రభుత్వం ఉచితంగా గడ్డి విత్తనాలు, దాణా అందించేది.

ఐదారు ఏళ్ల నుంచి ప్రభుత్వం వీటి సరఫరా నిలిపి వేయడంతో పశు పోషణ రైతులకు భారంగా మారింది. సంవత్సరం పాటు నిలువ ఉంచడానికి గడ్డి మోపులను కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. వ్యవసాయ భూమి, బోరు మోటారు ఉన్న రైతులకు ప్రభుత్వం గడ్డి విత్తనాలను, అలాగే దాణా సరఫరా చేస్తే పోషణ భారం తగ్గుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ప్రాణహిత- చేవెళ్ల పథకం వైఎస్సార్ కల



షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు

- 22, 23వ ప్యాకేజీలను పూర్తి చేయిస్తాం
- ప్రభుత్వ సలహా దారు షబ్బీర్ అలీ

భిక్కనూరు: కోనసీమ జిల్లాల మాదిరిగా తెలంగాణలో కూడా రైతులు మూడు పంటలు పండించాలనే ఉద్దేశంతో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత- చేవెళ్ల పథకాన్ని ప్రారంభించాడని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ప్రాణహిత- చేవెళ్ల పథకానికి ప్రభుత్వం రూ. 23 కోట్ల 15 లక్షలను మంజూరు చేయడానికి కృషి చేసిన షబ్బీర్‌అలీని భిక్కనూరు,దోమకొండ కాంగ్రెస్ నేతలు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల పూర్తి చేయాలని వైఎస్సార్ కలలు కన్నాడన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఏ మాత్రం నిధులను మంజూరు చేసిన పాపన పోలేదన్నారు.22,23 ప్యాకేజీలను పూర్తి చేయించి రైతులు మూడు పంటలు పండించే విధంగా కృషిచేస్తానన్నారు. మరో 200 కోట్లు ఈ పథకానికి అవసరమతాయన్నారు. ఈ నిధులను మంజూరు చేయించేందుకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్, దోమకొండల మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, విండో చైర్మన్ గంగళ్ల భూమయ్య, నేతలు శ్రీరాం వెంకటేశ్, నీల అంజయ్య, లింబాద్రి, దుంపల మోహన్‌రెడ్డి, అందె దయాకర్‌రెడ్డి, నర్మల రాంచంద్రం, శ్రీకాంత్, రమేష్ , సలీం తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్: ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి గ్రామ శివారులో ఆటోను బైక్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని జంగమాయిపల్లి గ్రామానికి చెందిన విక్రమ్ బైక్‌పై పిట్లం వైపు బయలుదేరాడు. తిమ్మారెడ్డి గ్రామ శివారులో అతడు బాన్సువాడ నుంచి ఎల్లారెడ్డి వైపునకు వస్తున్న ఆటోను రాంగ్‌రూట్‌లో వెళ్లి ఢీకొట్టాడు. ఈ ఘటనలో విక్రమ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స చేసి, అక్కడి నుంచి నిజామాబాద్‌కు రిఫర్ చేసినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండా వద్ద ఆదివారం రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన పోచయ్యకు, మరో బైక్‌పై ఉన్న మహిళకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన ఇద్దరిని స్థానికులు ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



బస్వాపూర్ జెడ్పీహెచ్ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



సదాశివనగర్ జెడ్పీహెచ్ఎస్ 2004-05 విద్యార్థులు



లింగంపేట జెడ్పీ బాలుర పాఠశాల 1998-99 ఎస్సెస్సీ విద్యార్థులు

దశాబ్దాల తర్వాత ఒక్కచోటికి..

- పలు చోట్ల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఆత్మీయ పలకరింపులతో భావోద్వేగానికి గురైన మిత్రులు



కామారెడ్డిలోని వాసవి పబ్లిక్ స్కూల్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



సదాశివనగర్ జెడ్పీహెచ్ఎస్ 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

చిన్ననాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒక్కచోటికి చేరడంతో హర్షం వ్యక్తం చేశారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని భావోద్వేగానికి గురయ్యారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. - సాక్షి నెట్‌వర్క్

నిరుపయోగంగా నీటి ట్యాంకులు



బొప్పాస్‌పల్లిలో వృథాగా పారేసిన వాటర్ ట్యాంకు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో నిధులు లేవని నీటి ట్యాంకులను నిరుపయోగంగా వదిలేశారు. మండలంలోని బొప్పాస్ పల్లి గ్రామంలో గతంలో నర్సరీలో ఉపయోగించిన నీటి ట్యాంకును అలాగే వదిలేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీకి కొత్తది కొని వాడుతున్నారు. అంకోల్ తండాలో నీటి సమస్య తీర్చడానికి పంచాయతీ నిధులతో సింగిల్ ఫేజ్ మోటారు వద్ద ట్యాంకు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం దిమ్మె కూలి పోవడంతో నీటి ట్యాంకును అలాగే వదిలేశారు. ఉన్న వాటిని ఉపయోగించకుంటే నిధుల కొరత ఉండదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



అంకోల్ తండాలో పక్కన పెట్టిన నీటి ట్యాంకు



అంకోల్ తండాలో దిమ్మె కూలిన సింగిల్ ఫేజ్ మోటారు పరిస్థితి

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

మద్నూర్/తాడ్వాయి : వాహనదారులు లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని ఎస్సై విజయ్‌కొండ హెచ్చరించారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రహదారిపై ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానాలు విధించి హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరి కంటే మించి ప్రయాణిస్తున్న వారిని హెచ్చరించారు. మద్యం, మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. అలాగే తాడ్వాయి మండలంలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈకార్యక్రమంలో పోలీసు సిబ్బంది, హోంగార్డులు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



పోలీసు సిబ్బందికి కంటివైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఖలీల్‌వాడి: పోలీసు సిబ్బంది ఎల్లప్పుడు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. సిబ్బంది విధి నిర్వహణలో ఉండటంతో తమ ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో ఎన్నో రకాల అనారోగ్యాలకు గురవుతున్నారని, తమ ఆరోగ్యంతోపాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిజామాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ హాల్‌లో ఆదివారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితులలో కంటి వ్యాధులు ఎంతో వేగంగా విస్తరిస్తున్నాయని తెలిపారు. వ్యాధుల భారీన పడకుండా ఉండేందుకు తగిన ఆరోగ్య సూచనలు పాటిస్తే ఎంతో మంచిదన్నారు. ప్రతి ఒక్కరు పౌష్టిక ఆహారం తీసుకోవాలని తెలిపారు. పోలీసులు ఉచిత కంటి పరీక్షలు సద్వినియోగం చేసుకువాలని, ప్రతి ఒక్కరూ 6 నెలలకు ఒక్కసారి కంటి పరీక్షలు తప్పనిసరిగ్గా చేయించుకోవాలన్నారు. అనంతరం వైద్యులు 450 మంది సిబ్బందికి, వారి కుటుంబ సభ్యులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రొబేషనర్ ఐపీఎస్ సాయికిరణ్, అదనపు డీసీపీ(ఏఆర్) రామచందర్ రావు, ఏసీపీలు శ్రీనివాస్, మస్తాన్ అలీ, రిజర్వు సీఐ శేఖర్‌బాబు, సతీష్, సరళ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో గుండెపోటు: వృద్ధురాలి మృతి



మృతి చెందిన అనసూయ

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ వృద్ధురాలు గుండెపోటుతో మృతిచెందిన ఘటన ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. తాడ్వాయి మండలం ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన బుయ్య అనసూయ(60) అనారోగ్యానికి గురికాగా ఆదివారం భర్త, కోడలితో కలిసి కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుని తిరుగు ప్రయాణం కోసం నిజాంసాగర్ చౌరస్తాకు వచ్చి అక్కడ టీ తాగి బస్సు ఎక్కింది. కొద్దిసేపటికే ఛాతిలో నొప్పితో పడిపోయింది. ఆమెను వెంటనే అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేసినా ఫలించలేదు. గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు వడ్డెర కాలనీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందినట్లు ఎస్సై రామ్ తెలిపారు. కాలనీకి చెందిన లక్ష్మీ(38) అనే మహిళ టీ తాగడానికి సమీపంలోని హోటల్‌కు వెళుతుండగా క్రేన్ వ్యాన్ వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి కూతురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భైరాపూర్‌లో ఒకరి ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

మోపాల్: మండలంలోని భైరాపూర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన లకావత్ ప్రసాద్ (33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆరేళ్లుగా అతడు తలనొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా, చికిత్సలు చేయించుకున్న నొప్పి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో శనివారం రాత్రి అతడు పురుగుల మందు తాగాడు. ఆదివారం మధ్యాహ్నం కడుపు నొప్పి రావడంతో కుటుంబసభ్యులకు పురుగుల మందు తాగానని చెప్పాడు. వెంటనే వారు అతడిని నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రసాద్ భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అడ్లూర్ ఎల్లారెడ్డిలో వివాహిత..

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన మాందాపురం మంజుల (30)కు పాల్వంచ మండలం భవానిపేట గ్రామానికి చెందిన బాలకిషన్‌తో 9ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నిరోజుల నుంచి వారి కుటుంబంలో తరచు గొడవలు జరుగగా, మంజుల చెయ్యి విరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వచ్చింది. మంజుల తన భర్త, అత్తమామలతో ఇటీవల ఫోన్లో మాట్లాడగా వారు నువ్వు ఇక్కడికి వస్తే మేము చనిపోతాం అని చెప్పడంతో మనస్తాపం చెందింది. దీంతో ఆమె పుట్టినింట్లోనే చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతికి కారకులైన భర్త, అత్త, మామలపై చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వీడీసీలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గీత కార్మిక సంఘం నాయకులు

నిజామాబాద్‌నాగారం: గ్రామాల్లో వీడీసీల ఆగడాలపై అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఇప్పటికైనా స్పందించి ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ కోయడ నరసింహులు గౌడ్ అన్నారు. నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ గ్రామాలలో వీడీసీల కబంధ హస్తాలలో సాంఘిక బహిష్కరణలు ఈతవనం దగ్ధాలు, బెదిరింపులు ఆగకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం వెంటనే వీడీసీలను నిషేధించాలని వారి ఆగడాలను అరికట్టాలన్నారు. వీడీసీలపై బహుజన, వృత్తి, ప్రజా సంఘాలు అన్నీ కలిసి ఉద్యమాలు, పోరాటాలు చేయాలన్నారు. తాళ్ల రాంపూర్‌లో గౌడ గీత కుటుంబాల బహిష్కరణ, ఈతవనం దగ్ధం, గౌడ మహిళకు ఆలయంలో అవమానం ఘటన అనంతరం చెంగల్ కల్దుర్కి తగ్గెల్లి తదితర మండలాల్లో వేలాది ఈత వనాలను దగ్ధం చేయడం సరికాదన్నారు. అలాగే అంకాపూర్, కోటా ఆర్మూర్ గంగాసాగర్, మాక్లూరు బోర్గాంలలో వీడీసీలు బహిష్కరణలు, బెదిరింపులకు పాల్పడుతుండటం మాత్రం ఆగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వీడీసీలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, దగ్ధమైన ఈతవనాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వీడీసీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా నాయకులు శ్రీరాంగౌడ్, శేఖర్ గౌడ్, కిషన్ గౌడ్, తాళ్ల శ్రీనివాసగౌడ్‌లు ఉన్నారు.

ఎలుగుబంటి దాడిలో మహిళకు గాయాలు

సిరికొండ: అడవిలో తునికాకు సేకరణ వెళ్లిన ఓ మహిళపై ఎలుగుబంటి దాడి చేసి, గాయపర్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని చిన్నరెడ్డి తండాకు చెందిన భారతి అనే మహిళ ఆదివారం తండావాసులతో కలిసి జినిగ్యాల మైసమ్మ అటవీ ప్రాంతంలో తునికాకు సేకరణకు వెళ్లింది. తునికాకు తెంపుతుండగా పొదల్లో దాగి ఉన్న ఎలుగుబంటి ఒక్కసారిగా బయటకు వచ్చి ఆమెపై దాడి చేసింది. చుట్టుపక్కల ఉన్నవారు కేకలు వేయడంతో ఎలుగుబంటి అడవిలోకి పారిపోయింది. దాడిలో భారతి కాలుకు తీవ్ర గాయమైందని స్థానికులు తెలిపారు. చికిత్స నిమిత్తం ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆమెను ఇంటికి తీసుకువచ్చారు.

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గంగాధర్ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని ఐదో టౌన్ పరిధిలో బైక్ పోయిందని దర్శనం ప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో పోలీసులు వర్ని చౌరస్తా వద్ద వాహనాలను తనిఖీ చేయగా బోధన్‌కు చెందిన కన్యబోయి గంగాధర్ (30) అనుమానాస్పదంగా కనబడటంతో పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడిని విచారణ చేయగా బైక్ దొంగతనం చేసినట్లు తెలిపారు. గంగాధర్ దగ్గర నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

స్కూటీ చోరీ కేసులో..

ఖలీల్‌వాడి: నగరంలో ఇటీవల ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని కవిత కాంప్లెక్స్‌లో ఈనెల 2న మధ్యాహ్నం షేక్ కరీముద్దీన్ తన స్కూటీని పార్కింగ్ చేయగా, గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. వెంటనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా, స్కూటీపై అనుమానాస్పదంగా కనిపించిన యువకుడిని పట్టుకున్నారు. విచారణ చేపట్టగా విచారించగా అతడు ఎటువంటి సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా వెంటనే డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన చౌహాన్ అర్జున్(25)గా గుర్తించారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

కోటగిరిలో యువకుడి అదృశ్యం

రుద్రూర్: కోటగిరికి చెందిన అనిల్ (27) అనే యువకుడు గత రెండు రోజులుగా కనిపించడం లేదని ఎస్సై సునీల్ ఆదివారం తెలిపారు. ఈ నెల 3న ఉదయం పనికి వెళ్లిన అనిల్ తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితులు, బంధువుల వద్ద వెతికినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. దీంతో అనిల్ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగరంలో వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఆముద అంజయ్య (70) అనే వృద్ధుడు అదృశ్యం అయినట్లు ఎస్సై హరిబాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 2న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అంజయ్య తిరిగి ఇంటికి రాలేదన్నారు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబసభ్యులు మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అంజయ్య ఇంటి నుంచి వెళ్లే ముందు నీలి రంగు లుంగీ, తెలుపు బనియన్ వేసుకున్నట్లు తెలిపారు. అతడికి మతిస్థిమితం సరిగ్గా ఉండదని, ఆచూకీ తెలిసిన 8712659839, 8712659717 సమాచారం ఇవ్వాలని తెలిపారు.

సాలూరలో బైక్ చోరీ

బోధన్ రూరల్: సాలురా మండల కేంద్రంలో బైక్ చోరీపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన దాసరి రాజు తన బైక్‌ను శనివారం రాత్రి ఇంటి ముందు ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని చోరీ చేశారు. మరునటి రోజు బైక్ చోరీని గుర్తించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో హుండీ..

నవీపేట: మండలంలోని యంచ విఠలేశ్వరాలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై వినయ్ ఆదివారం తెలిపారు. ఆలయంలోకి శనివారం అర్ధరాత్రి దుండగులు చొరబడి హుండీని పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అలాగే గర్భగుడిలోని బీరువా తాళాలు పగలగొట్టి ఆరు తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం పూజారి రంజిత్ ఆలయంలోకి వెళ్లగా చోరీని గుర్తించి, వీడీసీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చారు. వీడీసీ అధ్యక్షుడు సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.